ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- వేసవి వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష

కలెక్టరేట్ : మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : వేసవి వడగాల్పుల నష్టాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం కలెక్టర్‌లో వేసవి వడ గాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాబోయే వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లా దవాఖానలో ఫైర్ ఆడిట్ నిర్వహించాలన్నారు. వడ గాల్పుల పై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న టీచర్లు, కార్యకర్తల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి సమయాలను చేంజ్ చేయాలన్నారు. డీఎంహెచ్‌వో రజిత, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి వీ శ్రీధర్, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సంబంధిత ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)లో విద్యార్థుల వివరాల నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం కలెక్టర్‌లో డీఈఈటీ యాప్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం.. ప్రైవేట్ రంగంలో ఉన్న ఉద్యోగావకాశాల వివరాలు తెలుస్తాయని, నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీఈఈటీలో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో ఉన్న ఐటీఐ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాసైన విద్యార్థుల వివరాలను 15 రోజుల్లో డీఈఈటీలో నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీ హనుమంతు పాల్గొన్నారు.

ప్రతి సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 : విద్యార్థులంతా ప్రతి సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించేలా నిత్యం సాధన చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కిచెన్ స్టోర్ రూమ్‌లోని బియ్యం, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేసే సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మ, టీచర్లు పాల్గొన్నారు.

పిల్లలకు ఐ స్క్రీనింగ్ చేయించాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రజిత

కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : జిల్లాలోని ప్రభుత్వ బడులు, అంగన్‌వాడీలో చదివే పిల్లలకు ఐ స్క్రీనింగ్ చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత ఆర్‌బీఎస్‌కే అధికారులను సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌బీఎస్‌కే సిబ్బందితో ఐ స్క్రీనింగ్‌పై కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ స్కూల్స్, అంగన్‌వాడీలో ఉన్న పిల్లలకు ఐ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సంపత్ ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారిణి డా. నయీమా జహ, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి

రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణి

కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : పీఎం శ్రీ, సమగ్ర శిక్ష కింద ఉన్న నిధులను వినియోగిస్తూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమగ్ర శిక్ష, పీఎం శ్రీ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాలకు విడుదల చేసిన నిధులు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని, పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వినియోగించాలన్నారు. జిల్లాలో పీఎం శ్రీ క్రింద ఎంపికైన పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, జరుగుతున్న పనులను సమీక్షించాలన్నారు. సమగ్ర శిక్ష కింద ఉన్న నిధులు ఖర్చు పెడితే 4వ విడుత నిధులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సమావేశంలో సంబంధిత విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మాట్లాడుతూన్న ఎంపీడీవో మల్హోత్రా

ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 14: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల నియమ, నిబంధనలు పాటించాలని ఎంపీడీవోలు మల్హోత్రా, శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం వేములవాడ మండలం మారుపాక రైతువేదిక, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి రైతు వేదికలో పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోలు మాటాడుతూ నిబంధనలు పాటించాలని, స్పష్టమైన అవగాహన ఉంటే పొరపాట్లకు ఆస్కారం ఉండదన్నారు. కరదీపిక అనుసరించి ఎన్నికలు సజావుగా చేపట్టాలన్నారు. సందేహాలుంటే ఉన్నత అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఏపీవోలకు శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించామని ఎంపీడీవో శశికళ అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 36 మంది పీవోలు, 62 ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. గత రెండు రోజులు జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చారని మండలంలో మొదటి విడుత శిక్షణ పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి , పీవోలు, ఏపీవోలు ఉన్నారు.

గంభీరావుపేట, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికలకు గాను పీవో, ఏపీవో ఎన్నికల అధికారులకు శిక్షణ అందజేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆయా అధికారులకు శిక్షణ అందించామని ఎంపీడీవో రాజేందర్ తెలిపారు.

ఎన్నికలపై శిక్షణ తరగతులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 : బొప్పాపూర్ రైతువేదికలో రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఎంపీడీవో సత్తయ్య ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై పీవో, ఏపీవోలకు అవగాహన కల్పించారు. ఎంఈవో కృష్ణహరి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

భక్తురాలిని గాయపరిచిన రాజన్నకోడె

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 14 : రాజన్న దర్శనానికి వచ్చిన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బుచ్చి ఎల్లవ్వ రాజన్నను దర్శించుకొని కోడెమొక్కులు చెల్లించుకునే సమయంలో ఒక కోడె అకస్మాత్తుగా దాడి చేసింది. కోడె దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది హుటాహుటిన 108లో తిప్పాపూర్‌లోని ఏరియా దవాఖానకు తరలించి, వైద్యం చేయిస్తున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కోడె దాడిలో భక్తురాలి ఎడమకాలు విరిగినట్లు తెలిసింది.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుండెల్లి కల్యాణ్, మల్లారపు ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం.. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, కుమార్, అజయ్, నిఖిల్, సమీర్, సంజయ్, శివశంకర్ ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు ప్రశాంత్, కల్యాణ్

నమస్తే తెలంగాణ CLASSIFIED

GOLD FINANCE

★మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వధూవరులను ఆశీర్వదించిన చల్మెడ

వధూవరులను ఆశీర్వదిస్తున్న చల్మెడ లక్ష్మీనర్సిహారావు

కోనరావుపేట, ఫిబ్రవరి 14: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాట్ల రంజిత్, గ్రామ అధ్యక్షుడు వంగల శ్రీనివాస్ కూతుర్ల వివాహానికి వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్‌విండో చైర్మన్ రామ్మోహ న్‌రావు, మాజీ సర్పంచ్, గోపు పరశురాములు పాల్గొన్నారు.

మల్కపేట కాల్వనీళ్లు కేసీఆర్ పుణ్యమే..

మాట్లాడుతున్న వర్స కృష్ణహరి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 : మల్కపేట కాల్వనీళ్లు వస్తున్నాయంటే అది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యమేనని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మల్కపేట రిజర్వాయర్ నిర్మాణానికి, కాల్వలు, సొరంగాల నిర్మాణానికి కృషి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేవలం అందులో నీళ్లు వదిలేందుకు రైతులను ముప్పుతిప్పలు పెట్టి చివరకు రైతుల్లో అసహనాన్ని గమనించి , స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బందులను తెచ్చిపెడుతుందనే ఉద్దేశంతో నీళ్లు విడిచారని విమర్శించారు. గత ప్రభుత్వ కాలంలో రైతు బంధుకు, యూరియాకు రైతులు ఇబ్బందులు పడలేదని ఇప్పుడు రోజుల తరబడి ఎదురు చూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాష్, గుళ్లపల్లి నర్సింహారెడ్డి, నాయకులు ఎండ్ల సందీప్, మీసం రాజం, బాలయ్య, తిరుపతినాయక్, సీత్యానాయక్, శ్రీకాంత్, పవన్, రాము, నర్సింలు ఉన్నారు.

రైతన్నలకు సేవచేసే అదృష్టం కలిగింది

చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి

సహకార సంఘం చైర్మన్, పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న సీఈవో లక్ష్మణ్

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 14 : రైతన్నలకు సేవచేసే అదృష్టం కలిగినందుకు సంతోషంగా ఉందని వేములవాడ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఐదేళ్లు పూర్తిచేసుకోవడంతో చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను సీఈవోతో పాటు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో సైతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతుల పక్షాన పని చేశాయని ఆయన గుర్తుచేశారు. ఈ ఐదు సంవత్సరాల్లో రైతుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఎంతగానో కృషి చేశామని గుర్తుజేశారు. పాలకవర్గం ఏర్పడినప్పుడు రూ.11 కోట్ల వ్యాపారాలు నడుస్తున్నాయనీ ఈ ఐదు సంవత్సరాల్లో రూ.37 కోట్ల వ్యాపారాన్ని పెంచామన్నారు. రైతు లు, డైరెక్టర్ల సహకారంతో సహకార సంఘాన్ని అన్ని రంగాల్లో ముందుంచామన్నారు. ఈ ప్రాంత రైతుల సహకారాలు ఎప్పటికీ మర్చిపోలేమని, పాలకవర్గంపై చూపెట్టిన మమకారాలను జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. అధికారంతో ఉన్న, లేకున్నా రైతుల కోసం పనిచేస్తామన్నారు. రైతులకు లాంటి అవసరం ఉన్న తనని సంప్రదించాలని చైర్మన్ కోరారు. ఐదేళ్ల కాలంలో రైతల కోసం గోదాంల నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. సీఈవో లక్ష్మణ్, వైస్ చైర్మన్ తూం లక్ష్మీకాంతరావు, డైరెక్టర్ తోట రాజు, ఏరువ జేసింత, కొండా వెంకటేశ్వం, చెర్ల అమృత, దొబ్బల మల్లేశం, నల్ల సంజీవరెడ్డి, రొక్కం లచ్చిరెడ్డి, ఉత్కూరి సురేందర్‌రెడ్డి, గుగులోత్ భూలవ్వ, రాజయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.

జయంతిలో పాల్గొన్న నాయకులు

సంజీవయ్య జయంతి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 14: దామోదర సంజీవయ్య జయంతి శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ ప్రాంతంలోని సంజీవయ్య విగ్రహానికి నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 14 : మండలకేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం పాత బస్టాండు ఆవరణలో సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. సంఘం జిల్లా నాయకుడు రొడ్డ రామచంద్రం, ఎడ్ల సందీప్, పాటి నర్సింలు, బండి కిష్టయ్య, సూర్యం, దేవదానం, దేవిడ్, మంత్రి రాజు, బాలనర్సు, జీడి శ్రీనివాస్, బంటు రాజు, లింగాల దాసు, పెరుమాండ్ల రవి, మంత్రి బాల్‌నర్సు ఉన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తున్నాం

మాట్లాడుతున్న చైర్మన్ కిషన్‌యాదవ్

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 14 : రైతులకు మెరుగైన సేవలందించేందుకు సింగిల్‌విండోలు కృషి చేస్తున్నాయని పెద్దూరు సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం.. పెద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో చైర్మన్ వీర కిషన్‌యాదవ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కిషన్‌యాదవ్ మాట్లాడుతూ, తమ పాలకవర్గం రైతులకు సభ్యులకు మెరుగైన సేవలందించామన్నారు. రైతులకు సహకార సంఘాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆదాయ వ్యయాలతో పాటు ఎజెండాలోని అంశాలను ఆమోదం తెలిపారు. పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నారాయణగౌడ్, మాజీ కౌన్సిలర్ గుండ్ల సత్యానారాయణ, ఎరవెల్లి వెంకటరమణారావు, సీఈవో గౌరీశంకర్, రమేశ్, సభ్యులు ఉన్నారు.

ఘనంగా మాతృభాష దినోత్సవం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 : మండలంలోని కందికట్కూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, పాఠశాలలో మాతృ భాషా దినోత్సవం పురస్కరించుకొని తెలుగు శతక పద్యాల పఠన పోటీలను నిర్వహించారు. పోటీలో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి శాన్విక, ద్వితీయ బహుమతి అనన్య, తృతీయ బహుమతి మాన్వితకు ఎంఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గాలిపెల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పావని, ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, ఉపశ్రీ, స్వప్నరాణి, రవీందర్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ చందుర్తి మండలాధ్యక్షుడిగా సురేశ్

చందుర్తి ఫిబ్రవరి 14: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండలాధ్యక్షుడిగా గుడిమల్ల సురేశ్ ఎన్నికయ్యారు. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర డీటీఎఫ్ నాయకులు బూర సదానందం, సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు వంగ తిరుపతి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ, మండల పరిధిలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా బానోతు రాజు, భాగ్యలక్ష్మి, మహేశ్, కార్యదర్శులుగా ఈగ శ్రీనివాస్, కొండా రేవతి, లచ్చయ్య, కటుకం అమర్నాథ్, జిందం లక్ష్మణ్, ఆడిట్ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ సభ్యులుగా మరియాల కార్తీక్ జిల్లా కౌన్సిలర్‌గా గుర్రం కృష్ణారెడ్డి, గడప రఘుపతిరావు, జలేందర్ రెడ్డి, శంకర్, కే జనార్దన్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి

ముస్తాబాద్, ఫిబ్రవరి 14: రానున్న స్థానిక ఎన్నికలను ఎన్నికల అధికారులు సిబ్బంది పారదర్శకంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎంపీడీవో బీరయ్య ఎన్నికల సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఎన్నికల సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల అనుసారం సిబ్బంది పని చేయాల్సినవసరం ఉంటుందన్నారు. సిబ్బంది పూర్తి సహకారంతో ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు కాకుడా నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాటు ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

కోనరావుపేట, ఫిబ్రవరి14 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ శ్రీధర్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక ఆవరణలో ఎంపీడీవో శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంటు ప్రిసైడింగ్ అధికారులకు శుక్రవారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధానంపై సిబ్బందికి సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు ముఖ్యపాత్ర వహిస్తారని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రిపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

షాట్‌పుట్ గేమ్స్‌లో మానాల విద్యార్థి ప్రతిభ

రుద్రంగి, ఫిబ్రవరి 14: మండలంలోని మానాల గ్రామానికి చెందిన విద్యార్థి తూం శివచరణ్ అండర్-16 షాట్‌పుట్ పోటీలో నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి, శుక్రవారం మొదటి బహుమతి సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మానాల గ్రామానికి చెందిన యువకుడు శివచరణ్ అండర్-16 షాట్‌పుట్ పోటీలో మొదటి బహుమతి సాధించడంతో కుటుంబ సభ్యులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో పోటీలో ఉత్తమ ప్రతిభ చూపి గ్రామానికి పేరు తీసుకురావాలన్నారు.

మొదటి బహుమతితో శివచరణ్

సరైన పత్రాలు చూపి వాహనాలు తీసుకెళ్లండి

ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలోని స్వాధీనం చేసుకున్న వాహనాలను సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలని యజమానులకు ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. యజమానులు తీసుకెళ్లకుంటే ఆరు నెలల్లో వాటిని వేళం వేయనున్నట్లు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 13 పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు సందర్భాల్లో 64 వాహనాలున్నాయని, అందులో ఆటోలు 6, కార్లు 3, ద్విచక్రవాహనాలు 55 జిల్లా హెడ్ పోలీస్ క్వార్టర్‌కు తరలించినట్లు తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

వినోద్ (ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 14 : ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి ఆవునూరు గ్రామానికి చెందిన యువకుడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆవునూరుకు చెందిన పొట్టి నాగలక్ష్మి-ఎల్లయ్య దంపతుల కుమారుడు వినోద్ (31) వినోద్ తన బావ మరిదితో కలిసి కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వ్యక్తిగత పనులపై గురువారం రైల్లో ప్రయాణం చేస్తుండగా, మేడ్చల్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు పైనుంచి కిందపడి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వినోద్ మృతదేహం రాత్రి సమయంలో గుర్తించి పోస్టుమార్టంకు తరలించారు. శుక్రవారం వినోద్ మృతదేహాన్ని స్వగ్రామానికి చేరగా, మృతుడి భార్య గర్భిణి, కుటుంబసభ్యుల రోధనలు మిన్నంటాయి.

దళితుల భూముల్లో పంట సర్వే

సర్వే చేస్తున్న మధు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 14 : మండలంలోని గాలిపెల్లిలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిరుపేద దళితులకు 3 ఎకరాల భూ పంపిణీ చేసిన లబ్ధిదారులు ఏ పంటలు వేశారో శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ డీపీవో మధు క్షేత్రస్థాయిలో పర్యటించారు. లబ్ధిదారులు తమకు ఇచ్చిన ప్రభుత్వ భూ పంపిణీ కథకంలో పొందిన భూమిలో వేసిన పంటలను సర్వే చేసి, నమోదు చేశామన్నారు.

న్యాయవాదుల నిరసన

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడ, ఫిబ్రవరి 14: రంగారెడ్డి జిల్లా 9వ అడిషనల్ సెషన్స్ జడ్జి హరీశ్‌పై కరణ్‌సింగ్ అనే నిందితుడు చెప్పు విసరడాన్ని నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం తెలిపారు. శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ, ఫోక్సో కేసులో కరణ్‌సింగ్‌కు జీవిత ఖైదు విధించిన జడ్జిపై చెప్పు విసరడం బాధాకరమని, న్యాయసూత్రాల ప్రకారం.. తీర్పులు చెప్పే న్యాయమూర్తులపై దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన చర్య అని, న్యాయమూర్తులకు, న్యాయవాదులకు అండగా ఉంటామని, ఈ చర్యని నిరసిస్తూ విధులు బహిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అవధూత రజనీకాంత్,న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమల్‌గౌడ్, వేముల సుధాకర్ రెడ్డి, విద్యాసాగర్‌రావు, రేగుల దేవేందర్, పెంట రాజు, గొంటి శంకర్, పిల్లి మధు, కటకం జనార్దన్, బీమా మహేశ్, మాదాసు దేవయ్య, సుంకపాక నవీన్, తాహెర్‌పాషా, అనిల్, సుమన్, శ్రీకాంత్, మహేశ్, మమత, పావని తదితరులు ఉన్నారు.

గీత కార్మికులకు కాటమయ్య కిట్ వినియోగంపై శిక్షణ

ఇల్లంతకుంట రూరల్, ఫిబ్రవరి 14 : మండలంలోని ముస్కాన్‌పేట, రహీంఖాన్ పేట, వంతడుపుల, ఇల్లంతకుంట గ్రామాల్లోని గీతకార్మికులకు కాటమయ్య రక్ష కిట్ వినియోగంపై శిక్షకులు 50 మంది గీతకార్మికులకు శుక్రవారం శిక్షణ అందజేశారు. ప్రతి గీతకార్మికుడు కాటమయ్య రక్ష కిట్‌ను వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు జాగిరి అంజయ్యగౌడ్, పొన్నం వెంకటేశం, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది నరేందర్, శ్రీనివాస్, గౌడ సంఘాల అధ్యక్షుడు కొయ్యడ రాజయ్యగౌడ్, అంజయ్యగౌడ్, నాగుల చంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ఇల్లంతకుంట రూరల్, ఫిబ్రవరి14: ముస్కాన్‌పేటకు చెందిన సార శ్రీనివాస్ గౌడ్ (50) గీత కార్మికుడు శుక్రవారం తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

కర్శకమిత్ర చెక్కుల అందజేత

కోనరావుపేట, ఫిబ్రవరి 14: మండలకేంద్రంలో ప్రాథమిక సంఘం ఆధ్వర్యంలో కర్శకమిత్ర ఎల్‌టీ రుణాల చెక్కులను సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య యాదవ్ రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరం రైతుల శ్రేయస్సు కోసమే పనిచేస్తున్నామని తెలిపారు. 12 మంది రైతులకు గాను రూ. 62 లక్షల 50 వేల విలువ గల చెక్కులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కేడీసీసీబీ బ్యాంకు మేనేజర్ శర్మ, సింగిల్‌విండో వైస్ చైర్మన్ భూంరెడ్డి, సీఈవో కేశవులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.